క్లుప్తంగా

200 మందికి పెన్షన్లు పంపిణీ

చీరాల అర్బన్: పట్టణంలోని ఆవోపా కార్యాలయంలో నెరెళ్ల మోహనరావు, భాగ్యలక్ష్మి ఆవోపా బీద ఆర్యవైశ్య వికాలాంగుల, వృద్ధుల పెన్షన్ పథకం ద్వారా ఆదివారం 200 మందికి రూ.200 చొప్పున నగదు, నిత్యావసర వస్తువులను సూరె బాలకృష్ణ దంపతుల సహకారంతో ఎం.వెంకట సుబ్బారావు, కోట నాగేశ్వరరావు, మద్ది లక్ష్మిల ద్వారా అందించారు. కార్యక్రమానికి సూరె అలేఖ్య, శ్రీలేఖ్య లక్ష రూపాయలు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఇంగ్లాండ్ ఆధ్వర్యంలో బియ్యం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, కార్యదర్శి కోడూరి ఏకాంబరేశ్వరబాబు, కోశాధికారి పేర్ల వెంకటరామయ్య, మారుటూరి రాఘవేంద్రరావు, గురుప్రసాద్, పీ శ్యామసుందరరావు, వూర మస్తాన్‌రావు, గుర్రం మురళీకృష్ణ, భాగ్యలక్ష్మి, శోభారాణి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం



చీరాలలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

చీరాల అర్బన్: దసరా సెలవుల సందర్భంగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని చీరాలలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. విద్యార్థుల చేత కథల పుస్తకాలు చదివించడం, ఆటపాటలు కార్యక్రమాలు చేయించారు. దసరా సెలవుల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకురాలు డి.ధనమ్మ తెలిపారు.

సంతమాగులూరు (అద్దంకి): పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతో అవసరమని గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.



సంతమాగులూరులో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్, విద్యార్థులు

భవిష్యత్ తరానికి స్వచ్ఛమైన పర్యావరణాన్ని ఇద్దాం

చినగంజాం: స్వచ్ఛమైన గాలి, నీరు సారవంతమైన నేలలను భావితరాలకు అందిద్దాం అని ఎంపీడీఓ కే స్వరూపరాణి అన్నారు. నా మట్టి–నాదేశం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నా మట్టి నాదేశం కార్యక్రమం ద్వారా భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ దాసు, ఏపీఓ జీ లక్ష్మీదేవి, ఏపీఎం అంజిబాబు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్‌లు, డ్వాక్రా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



జాగర్లమూడిలోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు



కారంచేడులో బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో దుర్గమ్మ



చెన్నుపల్లిలో బాలత్రిపుర సుందరీదేవిగా పార్వతి అమ్మవారు



అద్దంకి: అలంకరణలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



చినగంజాంలో అమ్మవారు..

బాల త్రిపురసుందరీదేవి నమోస్తుతే

- వైభవంగా దసరా నవరాత్రులు ప్రారంభం
- చీరాలలో 108 కలశయాత్ర



వేటపాలెంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన వెంకటేశ్వరస్వామి దేవస్థానం



చీరాల పట్టణంలో కలశయాత్రలో పాల్గొన్న మహిళలు



వైదనలో శక్తి కొలుపుల్లో పాల్గొన్న గ్రామస్తులు



చీరాలలో అమ్మవారి చిత్రపటాన్ని నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

చీరాల అర్బన్/వేటపాలెం: దసరా శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈతొమ్మిది రోజులు అమ్మవారిని పలు రకాల రూపంలో అలంకరించి ఉత్సవాలను మరింత శోభితంగా చేయడానికి ఆలయాలను సిద్ధం చేశారు. మొదటిరోజు అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దసరా శరన్నవరాత్రులను ఆదివారం చీరాల పట్టణంలో ఘనంగా ప్రారంభించారు. స్థానిక సంతబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారి చిత్రపటంతో నగరోత్సవం నిర్వహించారు. సంతబజారులోని దేవాలయం నుంచి 108 మంది మహిళలు కలశాలతో పట్టణంలో కలశయాత్రను నిర్వహించారు. ఆలయ మర్యాదలతో పుట్టింటి వారిని ఆహ్వానించి ప్రథమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ గుంటూరు మాధవరావు, కార్యదర్శి రాజా, కోశాధికారి జి.విశ్వం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలానే పట్టణంలోని పలు దేవాలయాల్లో దసరా నవరాత్రులను ఘనంగా ప్రారంభించారు. బెస్తపాలెంలోని సాయిబాబా మందిరంలో బతుకమ్మ ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

వేటపాలెం గడియార స్తంభం సెంటర్‌లో గల రాజ్యలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయాన్నే సుప్రభాతసేవ నిర్వహించారు. అఖండ జ్యోతి ప్రజ్వలన, మండపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని హంసవాహనంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన పగబట్టిన సింహాలు సాంఘిక నాటకం ఆహూతులను ఆకట్టుకుంది. కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆలయ అధ్యక్షుడు ముత్తుకుమరన్ ఇంటి నుంచి అమ్మవారి బంగారు ఆభరణాలు ఆలయానికి ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించి అఖండ కలశ స్థాపన చేశారు. లైబ్రరీ వద్దగల మహాలక్ష్మమ్మ మందిరంలో, ఆణుమల్లిపేట మహాలక్ష్మమ్మ చెట్టు మందిరం వద్ద బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించారు.

ముస్తాబైన ఆలయాలు..

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కనకదుర్గమ్మను పోలిన కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని సంవత్సరాలుగా ఆలయ దర్మకర్తల ఇంటి నుంచి అమ్మవారి నగలు వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వేణుగోపాలస్వామి గుడి, పెదబజారు శివాలయం, వెంకటేశ్వరస్వామి వారి గుడి, సాయి మందిరం, కట్టమల్లేశ్వరస్వామివారి గుడి, స్వర్ణ వెంకటేశ్వరస్వామివారి ఆలయం, శివాలయం, వల్లభరాయస్వామివారి ఆలయాల్లో ప్రత్యేకంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు.

చినగంజాం రైల్వేస్టేషన్ సెంటర్‌లోని భవానీపురం నందు వేంచేసి ఉన్న విజయ కనకదుర్గా భవాని అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదోక్తానుసారం పండితులచే కలశ స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించగా దొడ్ల వెంకటేశ్వరరెడ్డి, గీతాంజలి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోపిరాల లలితా పరమేశ్వరీ సమేత రామకోటేశ్వరస్వామి ఆలయంలో పర్వత రెడ్డి నరేంద్ర, కళ్యాణి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో అమ్మవారు, పూనూరు త్రిపురసుందరి సమేత త్రిపురాంతకస్వామి ఆలయం, రామకృష్ణ ధ్యానమందిరంలో త్రిపురసుందరి, గాయత్రిదేవి, నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు, గన్నవరం కాశీ విశ్వేశ్వర, అన్నపూర్ణ ఆలయం, యద్దనపూడి రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు.

300 మంది మహిళలతో కలశస్థాపన..

బల్లికురవ/మేదరమెట్ల/అద్దంకి రూరల్/అద్దంకి/జే.పంగులూరు: దసర శరన్నవరాత్రుల సందర్భంగా మండలంలోని ఆలయాల్లో రోజుకొక అలంకరణతోపాటు ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. చెన్నుపల్లి గ్రామంలోని గంగాపార్వతి సమేత పరుశవేదీశ్వరస్వామి ఆలయంలోని పార్వతి అమ్మవారిని, కోదండరామాలయంలోని సీతాదేవిని బాలత్రిపుర సుందరీ దేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. కొండాయపాలెం, కొణిదెన గ్రామాల్లోని ఆలయాల్లో కూడా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

అద్దంకిలోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. దీనిలో ఉదయం 108 కలశాలతో 300 మంది మహిళలతో ఊరేగింపుగా వచ్చి కలశ స్థాపన చేశారు. 52వ శరన్నవరాత్రుల సందర్భంగా పాత ఊటుకూరు సుబ్బరామయ్య బ్రదర్స్ 52 కిలోల లడ్డును ప్రసాదంగా అందజేశారు.

మన చేతుల్లోనే మన ఆరోగ్యం



అద్దంకిలో చేతులు శుభ్రపరిచే విధానాన్ని చూపిస్తున్న కరుణజ్యోతి



తిమ్మాయపాలెంలో చేతులను శుభ్రం చేసుకుంటున్న మహిళలు

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ విధిగా చేతులను శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులు దరిచేరవని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీవో కె.నేతాజీలు సూచించారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద చేతుల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయాల ఉద్యోగులతో కలిసి చేతుల పరిశుభ్రత కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రస్తుత కాలంలో పెరిగిపోతున్న అనారోగ్య సమస్యలకు మూలకారణం చేతులు పరిశుభ్రంగా ఉండకపోవడమే అన్నారు. సీజనల్ వ్యాధులు, ఇతర ప్రాణాంతక వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ సురేష్‌బాబు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు ఏఎన్‌ఎంలు, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం..

అద్దంకి రూరల్/అద్దంకి: చేతుల శుభ్రతతో ఆరోగ్యం ఇమిడి ఉందని ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. గ్లోబల్ హేండ్ వాష్ డే సందర్భంగా ఆయన మండలంలోని తిమ్మాయపాలెం ఎస్సీ కాలనీలో చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కాలనీలోని మహిళల చేత చేతులు శుభ్రం చేసుకునే విధాన్ని ఎందుకు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వీఓఏలు, స్వయం సహాయక సంఘ మహిళలు పాల్గొన్నారు. ఒంగోలు మిషన్ ప్రావిన్స్ స్త్రీల సహవాస నాయకురాలు కరుణ జ్యోతి అద్దంకిలోని బిలీవర్స్ ఈస్టర్ చర్చి ప్రపంచ చేతి శుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు.

పర్చూరులో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీనివాసరావు

పర్చూరు (చినగంజాం): రుగ్వేద్ క్రికెట్ అరీనా గ్రౌండ్‌లో ఆదివారం అండర్–16 లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోట శ్రీనివాసరావు పాల్గొని పోటీలను ప్రారంభించారు. పర్చూరు, బాపట్ల, ఒంగోలు, విజయవాడ, మంగళగిరి, కావలి నుంచి మొత్తం 6 టీంలు పాల్గొంటున్నట్లు రుగ్వేద్ క్రికెట్ అరోరా చైర్మన్ ఇంటూరి వంశీ కుమార్ తెలిపారు. మ్యాచ్‌లు 15 వ తేదీ నుంచి 23 వ తేదీ వరకు జరుగుతాయని ఆయన తెలిపారు. మ్యాచ్‌లకు ఆర్గనైజర్‌గా కోచ్ టీ శివ నాగేశ్వరరావు వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు.

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి



మసీదు సెంటర్‌లో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న సభ్యులు

చీరాల రూరల్/చీరాల అర్బన్: భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడులను ఆదివారం అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు షేక్ హుమయూన్ కబీర్, షేక్ సలాం, శిఖా సురేష్‌లు మాట్లాడారు. కలాం చిన్ననాటి నుంచి ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివారని, ఆయన దేశ మిసైల్ మ్యాన్‌గా ఖ్యాతి గడించారని చెప్పారు. కార్యక్రమంలో షేక్ రియాజ్, మేరిగ ఇస్మాక్, సయ్యద్ గౌస్‌బాషా, ఇలియాజ్, అన్సర్ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని కేజీఎం బాలికోన్నత పాఠశాలలో కలాం చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్విశెట్టి సుబ్బరామయ్య, పవని భానుచంద్రమూర్తి, అందె కనకలింగేశ్వరరావు, ఆంజనేయులు, హరిప్రసాద్, తడవర్తి చంద్రశేఖర్, మువ్వల శివప్రసాదరావు, జీవీఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న 15 మంది అరెస్టు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని నాగండ్ల గ్రామంలో పేకాట ఆడుతున్న 15 మంది వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్‌కే నాయబ్ రసూల్ తెలిపారు. గ్రామంలోని శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న సమాచారాన్ని తెలుసుకొని ఆయన తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ 52,650లు నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసిన వారిని సోమవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

నేడు ఇనగల్లులో గడప గడపకు..

పర్చూరు (చినగంజాం): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్చూరు మండలం ఇనగల్లు సచివాలయ పరిధిలో సోమవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొనున్నట్లు పార్టీ కార్యాలయం ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, జేసీఎస్ కన్వీనర్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

ఘనంగా భావన్నారాయణుడి బ్రహ్మోత్సవాలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

చినగంజాం: స్థానిక భూ సమేత భావన్నారాయణ స్వామి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీవారికి అమ్మవార్లకు విశేష పంచామృత స్నపన తిరుమంజనం, పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలను చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా వలివేటి లక్ష్మీకుమార్, సులోచనలు వ్యవహరించారు. సాయంత్రం బ్రహ్మోత్సవాల అంకురారోపణ కార్యక్రమాన్ని నిర్వహించగా మద్దాల రామప్రసాద్, రాధిక, మద్దాల వీరరాఘవయ్య, మహేశ్వరిలు ఉభయదాతలుగా వ్యవహరించారు. యాజ్ఞిక స్వామి పరాశరం రామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహన లక్ష్మీనరసింహచార్యులు, ఎన్‌వీ రమణ బాబు, గంజాం పున్నమాచార్యులు, వాకాని శ్రీనివాసరావులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

దసరా పండుగకు ఊరు వెళ్తున్నారా..?

పర్చూరు (చినగంజాం): దసరా పండుగకు ఊరు వెళ్తున్నారా.. అయితే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పర్చూరు ఎస్ఐ ఎన్ చెంచుప్రసాద్ అన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయే అవకాశం ఉంటుందని ఆయన హెచ్చరించారు. ముందుగానే బంగారం, డబ్బు మొదలైన విలువైన వస్తువులని బ్యాంకు లాకరులోగాని, ఏ విధంగానైనా సరే భద్రపరచుకోవాలని తెలిపారు. అదే విధంగా పండుగ సందర్భంగా ఎక్కడైనా కోడి పందేలు, జూదం, పేకాట మొదలైనవి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు విజయ నగర్‌కాలనీలో జేఏఎస్

చీరాల టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని విజయనగర్‌కాలనీ గ్రామ పంచాయితీలో నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యుల బృందం అన్నీ రకాల వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, ఈసీజీ, అన్నీరకాల మందులు అందుబాటులో ఉన్నాయని గ్రామస్తులందరూ ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

కేవీ పాలెంలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష..

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపునకు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా హాజరవుతారని గ్రామంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సోమవారం మండలంలోని జరుబులవారిపాలెంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డీ విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో అన్ని సాధారణ వ్యాధులతో పాటు, ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలోను సుమారు 7 రకాల టెస్టులు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించే ఈవైద్య శిబిరంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.